క్లుప్తంగా

కండక్టర్ నిజాయితీ



కావలి రూరల్: ఆర్టీసీ బస్సులో దొరికిన పర్సును ప్రయాణికురాలికి అందజేసి కావలి డిపో కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలు..పట్టణంలోని కొత్తబజారుకు చెందిన ఒరుగంటి అనంత రాజ్యలక్ష్మి తెట్టుకు వెళ్లేందుకు కావలి నుంచి ఒంగోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో శుక్రవారం ఎక్కింది. తెట్టు వద్ద బస్సు దిగి వెళ్లే క్రమంలో పర్సును సీట్లో మరిచిపోయింది. పర్సును గమనించిన కండక్టర్ సతీష్‌కుమార్ దాన్ని జాగ్రత్తగా భద్రపరిచి కావలి డిపో అధికారులకు అందజేశారు. శనివారం రాజ్యలక్ష్మి తన భర్త రమేష్ బాబుతో కలిసి డిపో మేనేజర్ శ్రీనివాసులను సంప్రదించగా, విచారించి పర్సును అందజేశారు. సుమారు ఒకటిన్నర సవర బంగారం, రూ.1061 నగదు కలిగిన పర్సును నిజాయితీగా అందజేసిన కండక్టర్‌ను డిపో మేనేజర్ అభినందించారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఆత్మకూరు: పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని శనివారం ముమ్మరంగా నిర్వహించారు. వామపక్షాలు బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పీ బాబుల్‌రెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎండీ సాలారుద్దీన్, ఎస్కే సర్దార్, యస్దానీ బాషా, ఖాజారంతుల్లా, ఆఫ్రిద్, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా



మర్రిపాడు: మండలంలోని అచ్చమాంబ ఆలయం సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ శనివారం అదుపుతప్పి బోల్తా పడింది. నెల్లూరు నుంచి వైఎస్సార్ జిల్లా వైపు వెళ్తున్న సిమెంట్ లోడు ట్యాంకర్ అదుపు తప్పి చెట్లలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాద సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఘన సన్మానం



నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్ కో కన్వీనర్‌గా సేవలందిస్తున్న పర్వీన్‌ను మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ కేంద్రంలో శనివారం సన్మానించారు. స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ జాతీయ స్థాయి అవార్డును ఆమెకు హైదరాబాద్‌లోని భారత్ వికాస్ పరిషత్ – విశ్వగురు వరల్డ్ రికార్డ్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల అందజేశారు. ఈ క్రమంలో ఆమెను సన్మానించారు. ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ ఎన్నికల అధికారిగా సుధాకర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం ఎన్నికలను హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘ కోశాధికారి రామ్‌ప్రసాద్ మాట్లాడారు. కోవూరు తాలూకా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఖాదర్ బాషా ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారని చెప్పారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కొడవలూరు : టైరు పంక్చర్ కావడంతో ఆర్టీసీ బస్సు వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని బసవాయపాళెం వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకొంది. ఎస్సై జి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. బోగోలు మండలం చెన్నారాయుని పాళెం నుంచి అల్లూరు మీదుగా నెల్లూరు వెళ్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు కొడవలూరు మండలం బసవాయపాళెం వద్దకు రాగానే, ముందు టైరు పంక్చరైంది. దీంతో బస్సు అదుపుతప్పి వరి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో 75 మంది ప్రయాణికులు ఉన్నారు. అదుపు తప్పిన బస్సు పొలాల్లోకి వెళ్లినప్పటికీ బోల్తా పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా సురక్షితంగా బయట పడ్డారు. వారిని మరో ఆర్టీసీ బస్సులో ఎక్కించి పంపారు.

మెట్టవాసులకు సుజలం

మెట్ట ప్రాంతవాసుల దాహార్తి తీరనుంది. ప్రభుత్వం వైఎస్సార్ సుజల స్రవంతి పథకం కింద ప్రతిగ్రామానికి మినరల్ వాటర్ అందించి ఫ్లోరిన్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోంది. 2018లో అప్పటి ప్రభుత్వం రూ.15కోట్లతో అట్టహాసంగా మినరల్ వాటర్ పథకం పనులను ప్రారంభించింది. ఆ తరువాత ఎన్నికల పేరుతో పనులను అర్ధాంతరంగా పనులు నిలిపేసింది. ప్రస్తుత ప్రభుత్వం మినరల్ వాటర్ సరఫరాను పునఃప్రారంభించింది.

మండలం	గ్రామాల్లోని మినీ ప్లాంట్లు	మినరల్ వాటర్ సరఫరా గ్రామాలు
కొండాపురం	21	6
ఉదయగిరి	25	25
కలిగిరి	22	-
జలదంకి	22	22
దుత్తలూరు	25	-
వింజమూరు	21	-
సీతారామపురం	15	-



కొండాపురంలో ఏర్పాటు చేసిన మదర్ ప్లాంట్

కొండాపురం: మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లోరిన్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వైఎస్సార్ సుజల స్రవంతి పథకం కింద ప్రతిగ్రామానికి మినరల్ వాటర్ సరఫరాకు చర్యలు ప్రారంభించింది. 2018లో అప్పటి ప్రభుత్వం నియోజకవర్గ ప్రజలకు మినరల్ వాటర్ అందించేందుకు సుమారు రూ.15 కోట్లతో మినరల్ వాటర్ పథకం పనులను ప్రారంభించింది. మండల కేంద్రాలలో మదర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా చిన్న గ్రామాలకు సైతం మినరల్ వాటర్‌ను సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో భాగంగా కొన్ని గ్రామాల్లో నీటి నిల్వకు మినీట్యాంకులను సైతం ఏర్పాటు చేశారు. వీటికి మదర్‌ప్లాంట్ల నుంచి నీటిని తరలించేందుకు ట్రాక్టర్లను సైతం కొనుగోలు చేశారు. ఆ తరువాత ఏమైందో ఏమో కానీ అప్పటి ప్రభుత్వం ఎన్నికల పేరుతో పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో గత నెల నుంచి కొండాపురం, ఉదయగిరి , జలదంకి మండలాల్లో మినరల్ వాటర్‌నీటి సరఫరాను ప్రారంభించారు. కలిగిరి, దుత్తలూరు, వింజమూరు, వరికుంటపాడు సీతారామపురం మండలాల్లో పనులు పూర్తయ్యాయి. త్వరలో మినరల్ వాటర్ పంపిణీని ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా మినరల్ వాటర్ పూర్తిస్థాయిలో సరఫరా జరిగితే ఫ్లోరైడ్ సమస్య నుంచి విముక్తి లభిస్తుందని మెట్టప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేశారు.



సాయిపేటలో మినరల్ వాటర్‌ను పట్టుకుంటున్న ప్రజలు

తాగునీటికి ఇబ్బందులు పడ్డాం

ఇప్పటి వరకు ఫ్లోరిన్ నీటిని తాగలేక ఇబ్బందులు పడ్డాం. గత 20 రోజులుగా మినరల్ వాటర్ సరఫరా చేస్తుండడంతో ఎంతో సంతోషంగా ఉంది. మినరల్ వాటర్ సరఫరాతో ఫ్లోరిన్ సమస్య నుంచి విముక్తి లభిస్తుంది.

– ఎం మహేంద్ర, సాయిపేట బీసీ కాలనీ

పనులు పూర్తయ్యాయి

ఉదయగిరి నియోజకవర్గంలో అన్నీ మండలాల్లో మినరల్ వాటర్ పథకం పనులు పూర్తి స్థాయిలో జరిగాయి. ప్రస్తుతం ఉదయగిరి, జలదంకి మండలాల్లోని అన్నీ గ్రామాలు, కొండాపురం మండలంలోని ఆరు గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. మిగిలిన మండలాల్లోనూ మినరల్ వాటర్ సరఫరాను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

– నరసింహారెడ్డి, మేనేజర్, మినరల్ వాటర్ ప్లాంట్

దాసరిపల్లిలో కేంద్ర బృందం పరిశీలన

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లిలో కేంద్ర బృందం జాతీయస్థాయి మూల్యాంకన కమిటీ బృందం శనివారం పర్యటించింది. కేంద్ర బృందం ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాస్, కోఆర్డినేటర్ కిరణ్ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఉపాధిహామీ పనులు, హార్టికల్చర్ కింద సాగుచేసిన పండ్లమొక్కలు, మల్లారెడ్డిపల్లిలో గృహనిర్మాణాలను పరిశీలించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, ఎంపీటీసీ సుభాని, ఈఓపీఆర్డీ మల్లికార్జున, వైద్యాధికారిణి శివకల్పన, ఏపీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షాను, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వివాహానికి ఆర్థిక సాయం

ఉదయగిరి: గండిపాళెం ఎస్సీ కాలనీకి చెందిన గొల్లపల్లి శ్రీను, వెంగమ్మ దంపతుల కుమార్తె సుప్రియ వివాహ ఖర్చుల నిమిత్తం ఆ గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా శ్రీను దంపతులకు అందజేశారు. దీంతో వారు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు బీ వెంకటేశ్వర్లు, కాశయ్య, జీ సుమన్, షేక్ రెహమాన్, షేక్ జానీ, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

విద్యార్థులకు కుర్చీల వితరణ

వరికుంటపాడు: కాకొల్లువారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు కుర్చీలు, ప్యాడ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బాలభాస్కర్ మాట్లాడుతూ కుర్చీలను వితరణ చేసిన పాఠశాల పూర్వ విద్యార్థులు మాధవరపు నాగేంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మాధవరపు నాగరాజును అభినందించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కాకొల్లు శ్రీనివాసులు, సందిరెడ్డి మాలకొండయ్య, జీ గోపీచంద్, వెంకటేశ్వర్లు, కే వెంగయ్య, ఏ వెంకటరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కుర్చీలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

అనుమసముద్రంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆత్మకూరు బీఎస్సార్ వైద్యశాల డాక్టర్ షకీల అన్నారు. ఏఎస్‌పేట కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్థులకు శనివారం ఆమె క్రీడాసామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు కష్టపడి చదవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించేందుకు క్రీడలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, జేవీవీ నాయకుడు సాధిక్ హుస్సేన్, ఉపాధ్యాయినులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాసామగ్రి అందజేస్తున్న డాక్టర్ షకీల

డ్రైవర్స్ కాలనీలో రక్తదాన శిబిరం

నెల్లూరు(అర్బన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని వరపరివార్ సేవా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి పేర్కొన్నారు. ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అయ్యప్పగుడి సమీపంలోని డ్రైవర్స్ కాలనీలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. రక్తాన్ని నోవా బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు సేకరించారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ రాజు, సృజన సాంస్కృతిక వేదిక నేత రాధాకృష్ణ, ప్యూర్ స్మైల్స్ సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు పర్వీన్, విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సువర్ణకుమారి, హ్యాండ్స్ ఆన్ ఫౌండేషన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కాంపోజిట్ సిలిండర్లను ఆదరించండి

ఆత్మకూరు: అగ్ని ప్రమాదాలను నివారించేలా తక్కువ బరువుతో రూపొందించిన కాంపోజిట్ ఎల్‌పీజీ సిలిండర్లను వినియోగదారులు ఆదరించాలని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కోరారు. పట్టణంలో కాంపోజిట్ ఎల్‌పీజీ సిలిండర్లను శనివారం వారు ప్రదర్శించారు. కేవలం పది కేజీల బరువు కలిగిన ఫైబర్ సిలిండర్లను వినియోగించడం, రవాణా చేయడం సులభమని తెలిపారు. ఏజెన్సీ వద్ద సిలిండర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు 08627–220901నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఏజెన్సీ నిర్వాహకులు నజీర్‌బాషా, రజియా, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని కత్తులవారి వీధికి చెందిన మాజీ ఎంపీటీసీ కత్తుల శేషయ్య(64) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. శేషయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు నీలం సాయికుమార్, దైవాదీనం, షేక్ ఉస్మాన్‌షరీఫ్, నిమ్మల భాస్కర్, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చేజర్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రమీలారాజకుమారి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు సాధారణ మందులతో మూడ్రోజుల్లో తగ్గిపోతాయన్నారు. ఎవరికైనా తగ్గకపోతే వెంటనే రక్తపరీక్ష చేయించుకోవాలని సూచించారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ లక్షణాలు ఉంటే మెరుగైన వైద్యం చేయించుకోవాలని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆత్మకూరు సెబ్ అధికారులు శనివారం పట్టుకున్నారు. బోయలచిరివెళ్ల సమీపంలోని బొగ్గేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను నెల్లూరుపాళెం సబ్‌స్టేషన్ వద్ద సెబ్ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు.

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

కావలి: కాపురానికి తీసుకెళ్లాలంటూ భర్త ఇంటి ముందు భార్య ధర్నాకు దిగిన ఘటన కావలిలో శనివారం చోటు చేసుకుంది. బాధితురాలు షాన్‌వాజ్ తెలిపిన వివరాల మేరకు..కలిగిరి మండలం గుడ్లదొనకు చెందిన షాన్‌వాజ్‌ను కావలిలోని సంకులవారి తోటకు చెందిన జాఫర్‌కు ఇచ్చి ఏడు నెలల క్రితం మత పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. అప్పట్నుంచి వారి మధ్య శారీరక సంబంధం లేకపోవడంతో షాన్‌వాజ్ విషయాన్ని అత్తకు చెప్పగా, వైద్యులకు చూపిద్దామని ఆమెను పుట్టింటికి పంపించింది. ఆమె చదువుకుంటానని అత్తమామలకు చెప్పిన వద్దని నిరాకరించారు. షాన్‌వాజ్ కుటుంబ పెద్దలు వచ్చి జాఫర్‌ను వైద్యశాలకు వెళ్లి చూపించుకోవాలని సూచించినా సమాధానం చెప్పలేదు. దీంతో భర్త ఇంటి ముందు ధర్నాకు దిగినట్లు షాన్‌వాజ్ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని ఆమెకు న్యాయం చేస్తామంటూ అందరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

యునాని వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు: అతిప్రాచీనమైన యునాని వైద్యసేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు యునాని వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రజాక్ కోరారు. ఆత్మకూరు అర్బన్ వైద్యశాలలో జాతీయ యునాని డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునాని వైద్య పితామహుడు డాక్టర్ హకీం అజ్మీల్‌ఖాన్ జయంతిని ఏటా జాతీయ యునానిడేగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. అతిప్రాచీనమైన యునాని వైద్యంతో ఎన్నో రకాల దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని వివరించారు. ప్రభుత్వం యునాని వైద్యసేవలను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. అనంతరం డాక్టర్ అజ్మీల్ ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. వైద్య సిబ్బంది కృష్ణవేణి, చలపతి రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ అబ్దుల్ రజాక్

కుష్టు వ్యాధి నివారణకు సమష్టి కృషి

వరికుంటపాడు: సమాజంలో కుష్టు వ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ సమష్టిగా కృషిచేయాలని వరికుంటపాడు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజశేఖరరాజు పేర్కొన్నారు. మండలంలోని జడదేవిలో కుష్టువ్యాధి నివారణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు కుష్టు లక్షణాలని తెలిపారు. కుష్టును ప్రాథమిక దశలో గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చన్నారు. ఎవరికైనా కుష్టు లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో చేపడుతున్న కుష్టు సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిచారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమణమ్మ, ఆశాకార్యకర్త భారతి, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీహెచ్‌ఓ రాజశేఖరరాజు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అల్లూరు: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ శీనానాయక్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీరామకృష్ణ, డీటీ చెంచయ్య, ఆర్ఐ సుధీర్, వీఆర్వోలు రహ్మతుల్లా, సలాం, తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ శీనానాయక్

లోక్‌అదాలత్‌లో 574 కేసులు పరిష్కారం

ఆత్మకూరు: ఆత్మకూరు కోర్టులో శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో 574 కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి పీ రాజేష్, ప్రత్యేక మేజిస్ట్రేట్ ఎం రామకృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్ 107 క్రిమినల్, 452 పీటీసీ, 17 బ్యాంకులకు సంబంధించిన, 3 సివిల్ కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.3.55 లక్షల నగదును చెల్లింపులు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ సుకన్య, న్యాయవాదులు, వివిధ పోలీసు స్టేషన్ల ఎస్సైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జిలు

ఘంటసాలకు కళా నీరాజనం

నెల్లూరు(బృందావనం): పద్మశ్రీ ఘంటసాల వర్ధంతిని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పాటలు, డ్యాన్స్ పోటీలను నిర్వాహకుడు సుబ్బారావు పర్యవేక్షణలో జరిపారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఘంటసాల పాటలను గాయకులు మధుసూదన్, షఫీ, రామచంద్రరావు, ఝాన్సీ, తదితరులు ఆలపించారు. సంగీత విభావరిని బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు కాలేషా, అడ్వొకేట్ రమాదేవిని సత్కరించారు. జయప్రకాష్, రాయప్ప, తదితరులు పాల్గొన్నారు.



రమాదేవి, కాలేషాకు సత్కారం

కేపీసీ కళాశాల పీడీగా వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఇంటర్ విద్య కమిషనర్ శేషగిరిబాబు ఉత్తర్వులను జారీ చేశారు. నగరంలోని వేణుగోపాలస్వామి జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఈయన పనిచేశారు. ఎయిడెడ్ కళాశాల కావడంతో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని ప్రభుత్వంలోకి విలీనం చేశారు. ఈయనతో పాటు అధ్యాపకేతర సిబ్బంది రవిచంద్రన్, సుజాతమ్మ కేపీసీ కళాశాలలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గురవయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలలో 1974 – 77 మధ్య బీకాం చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని డీఆర్ ఉత్తమ హోటల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ ప్రిన్సిపల్ రవీంద్రబాబు మాట్లాడారు. వీఆర్ విద్యాసంస్థల్లో చదివిన ఎంతో మంది వివిధ హోదాల్లో ఉన్నారని చెప్పారు. వీఆర్ విద్యాసంస్థలకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు యత్నించాలని కోరారు. అనంతరం పూర్వ ప్రిన్సిపల్స్ రామచంద్రారెడ్డి, బాబర్ అహ్మద్ అలీ, భవానీ శంకర్, అధ్యాపకుడు ప్రసాద్, ప్రస్తుత ఇన్‌చార్జి ప్రిన్సిపల్ తనూజను అలుమ్ని ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పూర్వ విద్యార్థులు జనార్దన్, హనుమంతరావు, జగదీష్, రమేష్, విష్ణుమోహన్, ఖాజా, ఖాదర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రబాబు

కబడ్డీ విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు బీజేవైఎం చేయూతనందిస్తోందని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవాన్ని శనివారం జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి నెలా క్రీడా పోటీలను నిర్వహించనున్నారని వివరించారు. అనంతరం విజేతలైన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, జెనెక్స్ కాలేజీ జట్లకు జ్ఞాపికలు, రూ.82 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘునందన్, విజయలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

